క్లుప్తంగా

అవినీతి అధికారులపై చర్యలకు డిమాండ్

అల్లిపురం: జీవీఎంసీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి ఆదాయ పన్ను వసూలు చేసి, అందులో కొన్ని లక్షలు యూసీడీ విభాగంలోని కొంత మంది అధికారులు, ఎస్‌ఎల్‌ఎఫ్ లీడర్లు తమ అకౌంట్లలోకి బదిలీ చేసుకున్నారని, ఇలాంటి అక్రమాలకు పాల్పడిన వారిని సస్పెండ్ చేయాలని సీపీఎం ఫ్లోర్‌లీడర్ డాక్టర్ బి.గంగారావు డిమాండ్ చేశారు. 2018-19-20 సంవత్సరాల్లో పారిశుధ్య కార్మికుల వేతనాల నుంచి చట్టవిరుద్ధంగా ఇన్‌కమ్ ట్యాక్స్ కట్ చేశారని పేర్కొన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు ఇన్‌కమ్ ట్యాక్స్ పరిధిలోకి రారని ఆయన స్పష్టం చేశారు. వారి వేతనాల నుంచి కట్ చేసిన సొమ్మును తిరిగి కార్మికుల అకౌంట్లలో జమ చేయాలన్నారు. చట్టపరంగా విచారణ జరిపి అవినీతికి పాల్పడిన ఎస్‌ఎల్‌ఎఫ్ నాయకులను తొలగించాలని కోరారు. భీమిలి, మధురవాడ జోన్ల పరిధిలో టెక్నికల్ సమస్యల వల్ల జమ కాని సొమ్ము వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

డీసీకి అభినందనలు


ఉప కమిషనర్ సుజాతను అభినందిస్తున్న అధికారులు

మహారాణిపేట: దేవదాయ శాఖ జోన్‌-1 ఇన్‌చార్జి ఉప కమిషనర్ (డీసీ)గా పని చేస్తున్న ఎన్.సుజాతకు ఉప కమిషనర్ (డీసీ, రెగ్యులర్)గా పదోన్నతి లభించింది. ఈ మేరకు పలువురు ఆమెను అభినందించారు. మంగళవారం శ్రీకాకుళం దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ (ఏసీ) బలివాడ ప్రసాద్ పట్నాయక్, పలు దేవాలయాల కార్యనిర్వహణాధికారులు శ్యామలరావు, సర్వేశ్వరరావు, శేఖర్‌బాబులు, డీసీ కార్యాలయం పర్యవేక్షకుడు ఎస్.విజయకుమార్, సీనియర్ అసిస్టెంట్ మురళీమోహన్ తదితరులు డీసీని సత్కరించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన


రక్తదానం చేస్తున్న విద్యార్థులతో చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గోపాలపట్నం: నరవలోని విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే సందర్భంగా మంగళవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కళాశాల చైర్మన్ జి.సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ జాతీయ సేవా పథకం దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరం చేయడం ఎంతో మంచి విషయమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీ ప్రదీప్‌వర్మ మాట్లాడు తూ రక్తదానం అంటే మరొకరి ప్రాణాలను కాపాడడమేనన్నారు. శిబిరంలో సుమారు 100 యూనిట్లు రక్తాన్ని సేకరించామని తెలిపారు. ఇందుకు సహకరించిన అమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ చిట్టిమిరెడ్డి వీరునాయుడు, కళాశాల బోర్డు డైరెక్టర్ బోను భాస్కరరావు పాల్గొన్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ


ఎయిడ్స్‌పై అవగాహన కల్పిస్తున్న యాక్సెప్ట్ సభ్యులు

పెదగంట్యాడ: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించవచ్చని యాక్సెప్ట్ ప్రొగ్రామ్ మేనేజర్ అనిల్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ బీసీ గేట్ వద్ద యాక్సెప్ట్ మైగ్రాంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, దాని నివారణ విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

వామ్మో.. ప్లాస్టిక్ బాటిళ్లు

ప్లాస్టిక్ వినియోగం అధికమైంది. నిత్యం ప్లాస్టిక్‌తోనే వ్యవహారాలు సాగుతున్నాయి. ప్లాస్టిక్ కవర్ల వినియోగం పక్కన పెడితే.. ప్లాస్టిక్ బాటిళ్ల వాడకం మరింత ఎక్కువైంది. దుకాణానికి వెళ్లడం.. ప్లాస్టిక్ మంచినీటి బాటిల్ కొనుగోలు చేయడం.. నీళ్లు తాగిన వెంటనే పక్కనే ఉన్న కాల్వలో పడేయడం పరిపాటిగా మారింది. ప్లాస్టిక్ బాటిల్ వినియోగం అధికమైతే అయ్యిందేమో గానీ.. ఆ ప్రభావం పారిశుధ్యంపై తీవ్రంగా పడుతోంది.


ప్రెస్‌క్లబ్ జంక్షన్ వద్ద ప్లాస్టిక్ బాటిళ్లను బయటికి తీస్తున్న పారిశుధ్య కార్మికుడు

- కాలువలకు అడ్డం పడి సాఫీగా సాగని మురుగు నీరు
- రోడ్లపైకి వస్తున్న చెత్తా చెదారం
- పారిశుధ్య కార్మికులకు తలనొప్పిగా మారిన వైనం

దాబాగార్డెన్స్: మురుగు కాల్వల్లో వేలాది ప్లాస్టిక్ బాటిళ్లు నిండి ఉంటున్నాయి. సజావుగా ప్రవహించే మురుగు నీటికి అడ్డంకిగా మారుతున్నాయి. ఫలితంగా ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి మురుగు నీరు నడి రోడ్డుపై ప్రవహిస్తోంది. దీనంతటికి ప్రధాన కారణం ప్లాస్టిక్ బాటిళ్లు. చాలా మంది దాహార్తి తీర్చుకోవడానికి బయట ప్లాస్టిక్ బాటిళ్లలోని మంచినీరు కొనుగోలు చేస్తున్నారు. నీళ్లు తాగిన తర్వాత ఖాళీ బాటిల్‌ను డస్ట్‌బిన్‌లో గానీ.. దుకాణాల వద్ద గల చెత్తబుట్టల్లో గానీ పడేయటం లేదు. తోచిన చోట ఖాళీ అయిన బాటిల్‌ను విసిరేస్తున్నారు. అలా ప్లాస్టిక్ బాటిళ్లు కాలువల్లో చేరుతున్నాయి. అవి చెత్తకు అడ్డం పడి మురుగు నీరు సాఫీగా ముందుకు సాగక రోడ్ల పైకి చేరి దుర్గంధం వ్యాపిస్తోంది. ఈ కారణంగా వ్యాధులు కూడా వ్యాప్తి చెందుతున్నాయి.


దాబాగార్డెన్స్ బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం ఎదురుగా ఉన్న కాల్వలోని ప్లాస్టిక్ బాటిళ్లను బయటికి తీస్తున్న పారిశుధ్య కార్మికులు

మురుగు సమస్యకు ప్రధాన కారణం..

నియోజకవర్గ పరిధిలో రోజుకో ప్రాంతంలో మురుగు కాల్వల్లో చెత్త పేరుకుపోయి.. మురుగు నీరంతా ప్రధాన రహదారులపై ప్రవహిస్తోంది. జీవీఎంసీ సిబ్బంది కూడా నిత్యం ఏదో చోట కాల్వల్లో పేరుకుపోయిన చెత్తా చెదారాలు తొలగిస్తూనే ఉన్నారు. కానీ ఫలితం కనిపించడం లేదు. అందుకు కారణం ప్లాస్టిక్ బాటిళ్లేనని పలువురు చెబుతున్నారు. అందుకు ఉదాహరణగా.. ఇటీవల ప్రధాన కూడళ్లు.. వీధుల్లో కాల్వల ద్వారా మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది పనులు చేపట్టారు. అయితే వారు కాల్వలో పేరుకుపోయిన చెత్త తొలగిస్తుంటే.. వందలాది ప్లాస్టిక్ బాటిళ్లు దర్శనమిస్తున్నాయి. మురుగునీటి ప్రవాహానికి ప్లాస్టిక్ బాటిళ్లు అడ్డంకిగా మారుతున్నాయని సిబ్బంది వాపోతున్నారు. అధికారులు.. ప్రజలు ఈ సమస్యపై దృష్టి సారించకపోతే ప్రమాదం పొంచి ఉన్నట్టే..

పాతనగరంలో..

ప్రధానంగా పాతనగరం పరిధిలోకి వచ్చే పూర్ణామార్కెట్, కనకమహాలక్ష్మి ఆలయం చుట్టుపక్కల ప్రాంతాలు, కన్వేయర్ బెల్ట్ ఏరియా, లక్ష్మీ టాకీస్ పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో ఎప్పుడు కాలువలు శుభ్రం చేద్దామని చూసినా మురుగు, చెత్తతో నిండిపోయిన వందలాది ప్లాస్టిక్ బాటిళ్లు బయటపడుతున్నాయి. ఇవి చెత్తతో కలిసిపోయి ఉండటం వల్ల మురుగు నీరు సాఫీగా సాగక రోడ్లు మురుగు నీటిమయంగా మారి ఆ పరిసరాలు దుర్గంధంతో నిండిపోతున్నాయి.


కాలువల నుండి బయటపడిన వందల కొద్దీ ప్లాస్టిక్ బాటిళ్లు

కఠిన చర్యలు తప్పవు..

ప్లాస్టిక్ బాటిళ్లను వాడేవారు బాధ్యతగా వాటిని డస్ట్‌బిన్లలో గానీ, చెత్తబుట్టల్లో గానీ వేయాలి. రోడ్డుపైన, కాలువల్లో పడేయడం వల్ల చెత్తకు అడ్డంకిగా మారి మురుగు నీటి ప్రవాహానికి ఇబ్బందులు ఏర్పడతాయి. దానివల్ల మురుగంతా రోడ్లపై పారి పరిసరాలు అపారిశుధ్యంగా మారిపోతాయి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత. అందుకు ప్రజలు సహకరించాలి. ఎవరైనా ప్లాస్టిక్ వాటర్ బాటిల్ కొనుగోలు చేసి వినియోగించిన తర్వాత కాల్వల్లో పడేస్తే కఠిన చర్యలు తప్పవు. పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి.

-మల్లయ్యనాయుడు,
జోనల్ కమిషనర్, జోన్‌-4

మరింత మెరుగైన వసతులకు కృషి

విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల కౌన్సిల్ సమావేశంలో తీర్మానం


సమావేశమైన కళాశాల కౌన్సిల్ సభ్యులు


ముడసర్లోవలో అంతర్జాతీయ నదుల దినోత్సవం నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

అల్లిపురం: విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాలలో వసతులు మెండుగా ఉన్నాయని, వాటిని మరింత పటిష్టపరచాలని కళాశాల కౌన్సిల్ తీర్మానించింది. ఈ మేరకు కళాశాల సమావేశ మందిరంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు, ఏయూ సైన్స్ అండ్ టెక్నాలజీ అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఆచార్య అనురాధ కామేశ్వరి, ఆచార్య సంధ్యా దీపిక, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో ప్రతి విభాగాన్ని ధ్రువీకరించాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. పరీక్షా విభాగాధిపతి అరుణ పద్మ పరీక్షలు నిర్వహించేబోయే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది లక్ష్మీగుప్తా, డాక్టర్ సజ్జనరావు, డాక్టర్ మన్మథరావు, అకడమిక్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ నదుల దినోత్సవం..

సౌత్ జైలురోడ్డులో గల విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం అంతర్జాతీయ నదుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు ముడసర్లోవ రిజర్వాయర్ క్లీనింగ్ ప్రోగ్రాం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నదుల పునరుద్ధరణ, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన, జలమార్గాల సంరక్షణకు ప్రజల్లో చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ కె. గీతాంజలి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కుట్రపూరిత చర్యలు విడనాడాలి


జీవీఎంసీ గాంధీ పార్కులో దీక్షలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న కుట్రపూరిత చర్యలను విడనాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 1277వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 11 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించాలన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని నిలిపేయాలని, ఇతర స్టీల్‌ప్లాంట్లకు కార్మికులను బదిలీ చేసే చర్యలను ఆపేయాలని కోరారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. గంగవరం పోర్టును ప్రభుత్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. డిమాండ్లపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోకపోతే రాబోయే కాలంలో సమరశీల ఉద్యమాల్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పుడు, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై.కొండయ్య, జిల్లా అధ్యక్షుడు కె.మల్లయ్య, తిరుపతిరావు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే

అపారిశుధ్యం నడుమ అమర్‌నగర్, సీబీఎం కాంపౌండ్ ప్రాంతాలు


అమర్‌నగర్‌లో చెత్త

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డులోని అమర్‌నగర్, సీబీఎం కాంపౌండ్ ప్రాంతాలు దుర్గంధభరితంగా మారాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్త కుప్పలు పేరుకుపోయి అపారిశుధ్యం తాండవిస్తోందని వాపోతున్నారు. ప్రజలు, వాహనాలు పెద్ద ఎత్తున రాకపోకలు సాగించే రోడ్డు చెంతనే చెత్త పేరుకుపోతున్నా పారిశుధ్య సిబ్బంది పట్టించుకోవడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నా శానిటరీ ఇన్‌స్పెక్టర్, సూపర్‌వైజర్ల జాడే కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


సీబీఎం కాంపౌండ్ రోడ్డులో పేరుకుపోయిన చెత్త

ముందస్తు జాగ్రత్తలతోనే వ్యాధుల కట్టడి


కేఆర్‌ఎం కాలనీలో పర్యటిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్

మద్దిలపాలెం: డెంగ్యూ, మలేరియా జ్వరాల నుంచి రక్షణకు ముందస్తు జాగ్రత్తే శ్రీరామరక్ష అని జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్ అన్నారు. జీవీఎంసీ 16వ వార్డు కేఆర్‌ఎంకాలనీలో నమోదైన డెంగ్యూ పాజిటివ్ కేసు సోకిన వ్యక్తి ఇంటిని ఆమె మంగళవారం సందర్శించారు. డెంగ్యూ సోకడానికి గల కారణాలు ఆరా తీశారు. ఇంటి పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్ర, మంగళవారాలు డ్రైడే పాటించాలని, ఆరోజు ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలను తొలగించుకోవాలని సూచించారు. ఇంటి వద్దకు వచ్చే యాంటీ మలేరియా బృందాలకు సహకరించాలన్నారు. వారి సూచనలు పాటించాలన్నారు. అనంతరం ఏఎన్‌ఎం, ఆశ, ఏఎల్‌వో సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. ఇంట్లో ఫ్రిడ్జిలు, ఏసీల ద్వారా వచ్చే నీటిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. వారం పైబడి ఉండే నీటి నిల్వలు దోమలకు ఆవాసాలుగా మారతాయని తెలిపారు. దోమ కాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయనే విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాత వెంకోజీపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రెహినిషా, మలేరియా సబ్ యూనిట్ అధికారులు నగేష్ పట్నాయక్, శేషుబాబు, సిబ్బందితో పాటు, జీవీఎంసీ యాంటీ మలేరియా బృందం సభ్యులు పాల్గొన్నారు.

వైశాఖి స్పోర్ట్స్ పార్కులో సుందరీకరణ పనులు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు సుందరీకరణకు పాలకవర్గం చర్యలు తీసుకుంది. ఈ మేరకు గత వారం రోజులుగా పనులు చురుగ్గా సాగుతున్నాయి. ముఖ్యంగా స్విమ్మింగ్ పూల్ ఆధునికీకరణ పనులు ఇప్పటికే పూర్తవగా పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలంలో పచ్చని తివాచీ ఏర్పాటుకు పనులు నిర్వహిస్తున్నారు. గడ్డితో ల్యాన్ తయారీ, ఇతర పనులకు రూ.80 వేలు ఖర్చవుతోందని అంచనా వేశారు. ఇప్పటికే పాత మట్టి తొలగించి కొత్త మట్టితో నింపారు. ఇది పూర్తిగా భూమిలో కుదురుకున్న తర్వాత గడ్డి తివాచీ పనులు ప్రారంభమవుతాయని అధ్యక్షుడు ససపల వరప్రసాద్ చెప్పారు. ల్యాన్ చుట్టూ రంగురంగుల అందమైన క్రోటన్స్, ఆక్సిజన్ మొక్కలు పెంచుతారు. పూలమొక్కలు పెంచి ఆకర్షణీయంగా తయారు చేస్తారు. వైశాఖి స్పోర్ట్స్ పార్కులోని గోపాల కృష్ణుడి విగ్రహానికి అనుబంధంగా ఉన్న స్థలంలో కొత్తగా మొక్కలు పెంచడంతోపాటు గడ్డితో పచ్చని తివాచీ ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం రూ.30వేలు ఖర్చవుతుందని అంచనా వేశారు. దీనిలో భాగంగా విగ్రహాన్ని శుభ్రపరిచి, రంగులు వేయనున్నారు. పనులన్నీ పూర్తయితే పార్కు మరింత సుందరంగా కనువిందు చేయనుంది.

సమస్యలు పరిష్కరించాలని వినతి


జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలోని పలు ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వార్డు కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ మంగళవారం జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వార్డులో విద్యుత్ లైట్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్ల సమస్యలపై స్పందించాలని, పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేసేందుకు కృషి చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

2న రోటరీ మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్

సీతంపేట : అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా రోటరీ క్లబ్ గ్రేటర్ విశాఖ ఆధ్వర్యంలో మెగా బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు క్లబ్ ప్రెసిడెంట్ ఎం.డి.యాసిన్ బాబా తెలిపారు. శంకరమఠం రోడ్‌లో గల ఆఫీసులో క్లబ్ ప్రతినిధులతో కలిసి టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అనకాపల్లి నుంచి ఇచ్ఛాపురం వరకు 22 క్లబ్‌లకు చెందిన 48 టీమ్‌లు టోర్నమెంట్‌లో పాల్గొంటాయన్నారు. విశాఖ రైల్వే ఇండోర్ స్టేడియంలో నిర్వహించే టోర్నమెంట్‌లో సుమారు వెయ్యి మంది రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొంటారని తెలిపారు. క్లబ్ పాస్ట్ అసిస్టెంట్ గవర్నర్ బి.బ్రహ్మానందం మాట్లాడుతూ ఈ టోర్నమెంట్ ద్వారా సేకరించిన నిధులను రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ పోలియో నిధికి అందజేస్తామని తెలిపారు. క్లబ్ సెక్రటరీ చింతా నేతాజీ మాట్లాడుతూ ఆసక్తి కలిగిన క్లబ్ సభ్యులు పేర్లను ఈ నెల 28లోగా రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం టోర్నమెంట్ కమిటీ చైర్మన్ డాక్టర్ అశోక్ 98663 46347ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ వైస్ ప్రెసిడెంట్ బి.భాస్కరరావు, రోటరీ సభ్యులు కె.ఎం.కె.రమేష్, సూర్యతేజ పాల్గొన్నారు.

మరమ్మతులు చేశారు.. గోతులు మరిచారు

- పైప్‌లైన్ పనులు చేసి కంతలు పూడ్చని జీవీఎంసీ సిబ్బంది
- ఇబ్బంది పడుతున్న పాదచారులు, వాహన చోదకులు


స్ప్రింగ్‌రోడ్డులో తవ్విన గోతిని పూడ్చని దృశ్యం


వెలంపేట వద్ద తవ్వి వదిలేసిన పైప్‌లైన్


ఏవీఎన్ కళాశాల డౌన్‌లోని పోస్టాఫీసు వద్ద తవ్వి వదిలేసిన గొయ్యి

జగదాంబ: జీవీఎంసీ తాగునీటి విభాగం సిబ్బంది నిర్వాకానికి ప్రమాదాలకు గురవుతున్నామని పాదచారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 35వ వార్డు వెలంపేట వద్ద పాతనగరానికి నీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ శిథిలమై నీరు వృథాగా పోతోంది. దీనిపై గతంలో సాక్షి కథనాలు ప్రచురించింది. దీనికి స్పందించిన జీవీఎంసీ అధికారులు వెంటనే నీటి సరఫరాకు అడ్డంకులు లేకుండా మరమ్మతులు చేశారు. పనుల్లో భాగంగా పైప్‌ల పనులు చేసి టెస్టింగ్ కోసం పైప్‌లను తిరిగి పూడ్చలేదు. అలా రోజులు గడిచిపోయాయి. దీంతో రహదారిపై బహిర్గతంగా పైపులను వదిలేయడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఏవీఎన్ కళాశాల డౌన్, స్ప్రింగ్‌రోడ్డులో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అవి ప్రధాన రహదారులు కావడంతో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నామంటూ తెలిపారు. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు పూర్తయిన పైప్‌లైన్ల వద్ద గోతులను పూడ్చాలని కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


ఎస్‌ఎంసీహెచ్ స్కూల్‌లో భోజనాలు పరిశీలిస్తున్న సీతమ్మధార మండలం ఎంఈవో - 2 బాలమణి

సీతమ్మధార : పీఅండ్‌టీ కాలనీలోని నెహ్రూ మున్సిపల్ పాఠశాలను సీతమ్మధార మండల ఎంఈవో - 2 బాలమణి మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. ఎంత మంది విద్యార్థులు స్కూల్‌కు వస్తున్నారు..?, వారిలో ఎంత మంది భోజనం చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్ ఆఫీస్‌లో ఉన్న రికార్డులను ఆమె పరిశీలించారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ నగరంలో బుధవారం పర్యటించనున్నారని, ఎస్‌ఎంసీహెచ్ హైస్కూల్‌కి వచ్చే అవకాశం ఉందన్నారు. మరుగుదొడ్లు, స్కూల్ ఆవరణ, తరగతి గదులు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ లేక గుడ్లు లేవు..

గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో విద్యార్థులకు మధ్యాహ్నం గుడ్లు ఇవ్వలేదు. దీంతో కొంత మంది గుడ్లు ఇవ్వలేదని వాపోయారు. ఈ విషయంపై హెచ్‌ఎం రాంప్రసాద్‌ను వివరణ కోరగా గ్యాస్ సిలిండర్ అయిపోవడంతో గుడ్లు అందించలేకపోయామని తెలిపారు. ఈ స్కూల్‌లో సుమారు 1100 మంది విద్యార్థులు చదువుతున్నారు. వారందరికీ గుడ్లు అందించలేదు.

27న యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సమ్మె


సీతమ్మధార యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు సీతమ్మధారలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, అప్రెంటిస్ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రీజినల్ కార్యదర్శి వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో సత్తా చాటిన విద్యార్థులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో నిర్వహించిన పలు క్రీడల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖోలో బాల, బాలికల జట్లు విన్నర్స్‌గా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికలు జూనియర్ విభాగంలో రన్నర్స్‌గా, చెస్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్ విభాగంలో బాలురు విన్నర్స్‌గా, చెస్‌లో రన్నర్స్‌గా నిలిచారని స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు. విజేతలను పాఠశాల హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, దేముళ్లు, ఉషారాణి, నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.